నమస్తే తెలంగాణ
హనుమకొండ
5 | వరంగల్, గురువారం 21 నవంబర్ 2024 | HANUMAKONDA

గిరిజనం కోసం బీఆర్ఎస్ నేతలు రోడ్డెక్కారు. మానుకోట మహాధర్నాపై సర్కారు ఉక్కుపాదం మోపడంతో కన్నెర్రచేశారు. లగచర్ల రైతుల సమస్యలపై గురువారం ధర్నాకు సిద్ధమవుతున్న తరుణంలో చివరి నిమిషంలో పోలీసులు అనుమతి నిరాకరించడంతో భగ్గుమన్న బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు ఎస్పీ క్యాంపు ఆఫీస్ ఎదుట ఆందోళనకు దిగారు. పోలీసులు పర్మిషన్ ఇచ్చినట్టే ఇచ్చి ప్రభుత్వ పెద్దల ఒత్తిడితో తలొగ్గి మోసం చేశారంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ క్రమంలో అనుమతి ఇవ్వాల్సిందేనంటూ అక్కడే బైఠాయించి అటు ఎస్పీకి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలతో నాలుగు గంటల పాటు ధర్నా కొనసాగించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను అడ్డుకునేందుకు రేవంత్ సర్కారు అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నదని, హైకోర్టు అనుమతితో త్వరలో 50వేల మంది గిరిజనులతో మహాధర్నా చేస్తామని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీలు సత్యవతిరాథోడ్, తక్కళ్లపల్లి రవీందర్‌రావు, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీ కవిత, మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్ వెల్లడించారు.

- మహబూబాబాద్ రూరల్, నవంబర్ 20

- మానుకోట మహాధర్నాకు అనుమతి ఇవ్వకపోవడంపై ఆగ్రహం
- ఎస్పీ క్యాంప్ ఆఫీస్ ఎదుట నాలుగు గంటల పాటు ఆందోళన
- ఎస్పీ తీరుపై అసహనం, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు
- పాల్గొన్న రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు, ఎమ్మెల్సీలు సత్యవతి, తక్కళ్లపల్లి, పోచంపల్లి, మాజీ ఎంపీ కవిత, మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్
- త్వరలో 50వేల మందితో సభ నిర్వహిస్తామని వెల్లడి

గిరిజనం కోసం బీఆర్ఎస్ రణం

ఎస్పీ క్యాంప్ ఆఫీస్ ఎదుట ధర్నా చేస్తున్న వద్దిరాజు, సత్యవతి, తక్కళ్లపల్లి, పోచంపల్లి, కవిత, శంకర్‌నాయక్

సర్కారు ఉక్కుపాదం మోపడంపై భగ్గుమన్న నాయకులు

లగచర్ల గిరిజనుల సమస్యలపై గురువారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మానుకోటలో నిర్వహించనున్న మహాధర్నాకు ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అనుమతి నిరాకరించారు. దీంతో ఆగ్రహించిన ఎమ్మెల్సీలు సత్యవతి రాథోడ్, తక్కళ్లపల్లి రవీందర్‌రావు, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్, ఇతర నాయకులు, కార్యకర్తలు రాత్రి 7 నుంచి 11 గంటల వరకు ఎస్పీ క్యాంప్ ఆఫీస్ ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రభుత్వానికి, ఎస్పీకి వ్యతిరేకంగా నేతలు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ కేటీఆర్ ధర్నా పిలుపుతో సీఎం రేవంత్ రెడ్డిలో వణుకు పుట్టిందని, మానుకోటలో బీఆర్ఎస్ ధర్నా చేస్తే రాష్ట్ర మంతటా ప్రజలు ఆందోళనలు చేపడతారనే భయంతో అనుమతి ఇవ్వడం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత శాంతి భద్రతలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. పోలీసుల అనుమతి నిరాకరణ నేపథ్యంలో మహాధర్నాను తాత్కాలికంగా వాయిదా వేశామని, త్వరలోనే 50 వేల మందితో నిర్వహిస్తామని సత్యవతి రాథోడ్ తెలిపారు. ఆందోళనలో మున్సిపల్ చైర్మన్ రాంమోహన్‌రెడ్డి , వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, యాళ్ల మురళీధర్ రెడ్డి, రఘు, వెంకన్న, మంగళంపల్లి కన్న, వేణు, రవికుమార్ పాల్గొన్నారు.

అనుమతి నిరాకరణ దారుణం

మూడు రోజుల క్రితమనే మహాధర్నా ఉందని ఎస్పీ దృష్టికి తీసుకుపోయాం. తీరా సమయానికి అనుమతి నిరాకరించడం దారుణం. పర్మిషన్ ఇస్తామని చెప్పి ఇప్పుడు మాత్రం డీజీపీ నుంచి ఒత్తిడి ఉందని, కేటీఆర్ ధర్నాకు అనుమతి ఇవ్వనని ఎస్పీ చెప్పటం సరైంది కాదు. ప్రజల సమస్యలపైన ధర్నా చేసే అధికారం ఎవరికైనా ఉంది. కాంగ్రెస్ పార్టీ బీఆర్ఎస్ నాయకులను నిర్బంధం చేసే పనిలో ఉంది. దానిని వెంటనే మానుకోవాలి. రాష్ట్రంలో ప్రస్తుతం పోలీస్ వ్యవస్థ మొత్తం ప్రజలకు రక్షణ లేకుండా రాజకీయ ముసుగులో నడుస్తుంది. కాంగ్రెస్ పార్టీకి తొత్తులుగా కాకుండా ప్రజలకు రక్షకులుగా ఉండాలి. – మాలోత్ కవిత, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు

లగచర్ల గిరిజనులకు న్యాయం జరగాలనే ధర్నా

లగచర్ల గిరిజనులకు న్యాయం జరగాలని, మానుకోట జిల్లాలో గిరిజనులు ఎక్కువగా ఉన్నారని కేటీఆర్‌ను ఇక్కడి గిరిజన సంఘాల నాయకులు సంప్రదించడంతో మహాధర్నాకు పిలుపునిచ్చాం. ఈ విషయాన్ని ఇప్పటికే ఎస్పీ దృష్టికి తీసుకెళ్తే పర్మిషన్ ఇస్తానని చెప్పారు. తీరా ధర్నా సమయానికి అనుమతి నిరాకరించడం దారుణం. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నిరుపేదలకు చేసిందేమీలేదు.

–ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి

ప్రజాస్వామ్యంలో ధర్నాలు చేసే హక్కు ఉంది

సమస్యల పరిష్కారం కోసం ధర్నాలు చేసే హక్కు ప్రజాస్వామ్యంలో ఉంది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం రాజ్యాంగ హక్కులను కూడా హరించి వేస్తున్నది. సామరస్యంగా గిరిజన జాతి పైన జరిగిన దాడులను నిరసిస్తూ ధర్నా చేస్తామంటే అనుమతిని నిరాకరించారు. అనేక ఏళ్లుగా ఈ ప్రాంత ప్రజలు ఉద్యమాల్లో పాల్గొనడం, ధర్నాలు చేయడం కొత్త కాదు. ప్రభుత్వం గిరిజన సమస్యలను పరిష్కరించే దిశగా ఆలోచన చేయాలి. –ఎమ్మెల్సీ రవీందర్‌రావు

గిరిజనుల హక్కులు కాపాడాలి

మహబూబాబాద్ ప్రాంతంలోని గిరిజన ప్రజాప్రతినిధులైన ఎమ్మెల్యే మురళీ నాయక్, ఎంపీ బలరాంనాయక్, ప్రభుత్వ విప్ రామచంద్రూనాయక్ గిరిజన ఓట్లతోనే గెలిచి వారి హక్కులను కాపాడడాన్ని విస్మరిస్తున్నారు. ఓట్లు వేసిన గిరిజనులు వారికి తగిన బుద్ధి చెప్పడం ఖాయం. ఉన్నతాధికారుల ఒత్తిడి ఉందని ధర్నాకు అనుమతి ఇవ్వకపోవడం దారుణం. ఎస్పీ అనుమతి ఇవ్వకపోయినా ధర్నా నిర్వహిస్తాం. గ్రామాల్లో యువత లడాయికి సిద్ధంగా ఉంది. రేవంత్ రెడ్డి మొండి వైఖరి నశించాలి.

–మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్

నేడు 144 సెక్షన్ : ఎస్పీ

మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా నేడు(గురువారం) 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఒక ప్రకటనలో తెలిపారు. నలుగురి కంటే ఎక్కువ మంది గుమికూడవద్దని, ఎవరైనా అతిక్రమిస్తే చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని పేర్కొన్నారు.

మహబూబాబాద్ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ ఎదుట మోహరించిన పోలీసులు



ధర్నాకు అనుమతి నిరాకరిస్తూ పోలీసులిచ్చిన ధ్రువీకరణ పత్రంతో బీఆర్ఎస్ నాయకులు

లగచర్ల రైతులపై కేసులు ఎత్తివేయాలి

- సీఎం రేవంత్‌రెడ్డిది నియంత పాలన
- గిరిజనుల భూములను అన్యాయంగా తీసుకోవద్దు
- లగచర్ల రైతులకు అండగా బీఆర్ఎస్
- ఎమ్మెల్సీలు సత్యవతి, రవీందర్‌రావు

మహబూబాబాద్ రూరల్, నవంబర్ 20 : సీఎం సొంత నియోజకవర్గం లగచర్ల గిరిజన రైతులపై పెట్టిన కేసులను ప్రభుత్వం వెంటనే ఎత్తివేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్, తక్కళ్లపల్లి రవీందర్‌రావు డిమాండ్ చేశారు. బుధవారం సాయంత్రం మహబూబాబాద్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాజీ ఎంపీ మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్‌లతో కలిసి వారు మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి తన సొంత ప్రయోజనం కోసం కావాలనే లగచర్లలో ఫార్మా కంపెనీ పెట్టేందుకు సిద్ధమయ్యారని, ఎన్నో ఏళ్ల నుంచి ఉన్న తమ పట్టా భూములను గిరిజన రైతులు ఎనిమిది నెలల నుంచి ఇవ్వబోమని చెప్పిన కూడా వారిని బలవంతం చేయడం తగదన్నారు. అక్కడి కాంగ్రెస్ నాయకులు రౌడీల్లాగా వ్యవహరిస్తూ అమాయకులైన గిరిజన రైతుల ఇండ్లలోకి వెళ్లి దౌర్జన్యంగా దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. లగచర్ల రైతులకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉండి పోరాటం చేస్తుందన్నారు. లగచర్ల ఘటనపై ఎస్సీ, ఎస్టీ, మహిళా కమిషన్ దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. ఈ సందర్భంగా లగచర్ల రైతులకు న్యాయం కోసం అలాగే రాష్ట్రంలో ఎక్కడ కూడా ఇలాంటి ఘటనలు జరగకుండా ఉండేందుకు మానుకోట జిల్లాలో కేటీఆర్ మహాధర్నాకు సిద్ధమైనట్లు తెలిపారు. మాజీ ఎంపీ మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చేందుకు అనేక హామీలు ఇచ్చి వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నాడని ధ్వజమెత్తారు. ముందుగా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేయాలని డిమాండ్ చేశారు. అలాగే బీఆర్ఎస్‌ను మొలకెత్తనియ్యను అంటూ అహంకారపూరితంగా మాట్లాడుతున్నాడని తెలంగాణ రాష్ట్ర సాధనలో, గత పదేళ్ల అభివృద్ధిలోనూ కేసీఆర్‌కు ఒక ప్రత్యేక స్థానం ఉందన్నారు. తెలంగాణ ఉన్నంత కాలం కేసీఆర్ చరిత్రలో ఉంటారని అది రేవంత్‌రెడ్డి గమనించి మాట్లాడాలని హితవు పలికారు. లగచర్ల గిరిజన రైతులకు న్యాయం జరిగేవరకూ బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని స్పష్టంచేశారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, ఎండీ ఫరీద్, భరత్‌కుమార్‌రెడ్డి, పర్కాల శ్రీనివాస్‌రెడ్డి, మంగళంపల్లి కన్న, జేరిపోతుల వెంకన్న, రవికుమార్, ముత్యం వెంకన్న పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు

రేవంత్‌వి చీటర్.. బ్రోకర్ మాటలు

తెలంగాణలో గంజాయి మొక్కవు.. నిన్ను పీకి పారేస్తాం

- కేసీఆర్ మహా వృక్షం.. ఆయనను ఏమీ చేయలేరు
- ఓటేసిన ప్రతి ఒక్కరిని మోసం చేసినవ్..
- మంత్రివర్గ విస్తరణ చేయలేని అసమర్థ సీఎంవి నువ్వు
- కేటీఆర్, హరీశ్‌రావుపై మాట్లాడే అర్హత లేదు
- కాళోజీ కళాక్షేత్రం మేము నిర్మిస్తే.. నువ్వు గొప్పలు చెప్పుకుంటున్నవ్
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- కాంగ్రెస్‌ది ముమ్మాటికీ వంచన సభ
- శాసనమండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ

హనుమకొండ, నవంబర్ 20 : అబద్ధపు మాటలు, మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడేవి చిల్లర.. చీటర్.. బ్రోకర్ మాటలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ధ్వజమెత్తారు. బుధవారం హనుమకొండలోని తన నివాసంలో శాసనమండలిలో ప్రతిపక్ష నేత మధుసుదనాచారి, మాజీ ఎమ్మెల్యేలతో కలిసి ఎర్రబెల్లి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమకొండ ఆర్ట్స్ కళాశాల మైదానంలో నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి విజయోత్సవ సభలో సీఎం మాట్లాడిన మాటలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. 'తెలంగాణలో కేసీఆర్ అనే మొక్కను మొలవనివ్వను అంటున్న రేవంత్‌రెడ్డి.. నువ్వు తెలంగాణలో గంజాయి మొక్కవు.. నిన్ను పీకి అవతల పారేస్తాం' అని హెచ్చరించారు.

కేసీఆర్ మర్రి చెట్టులాంటి మహా వృక్షం అని అన్నారు. సొంత పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలే రేవంత్‌ను పట్టించుకోవడం లేదని ఎద్దేవా చేసారు. ఇప్పటికి 30 సార్లు ఢిల్లీ చుట్టూ చక్కర్లు కొట్టినా సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ అపాయింట్‌మెంట్ ఇవ్వని విషయం తమకు తెలుసన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా పూర్తి స్థాయిలో మంత్రి వర్గ విస్తరణ చేయలేని అసమర్థ సీఎం రేవంత్‌రెడ్డి అని ఆరోపించారు. 'నన్ను రాక్షసుడు అన్నావు.. అవును నేను ప్రజల కోసం పనిచేసే రాక్షసున్నే.. నా ప్రజల కోసం ఏమైనా చేస్తాను' అని ఎర్రబెల్లి పేర్కొన్నారు. తాను ఏడుసార్లు వరుసగా గెలిచానని, ఒకసారి గెలిచిన చోట మరోసారి గెలిచిన చరిత్ర రేవంత్‌కు లేదన్నారు. 'నీ మాటలు నమ్మి ఓటేసిన ప్రతి ఒక్కరినీ మోసం చేశావు.. అధికారం వచ్చాక కూడా నీ ప్రవర్తనలో మార్పు రాకపోవడం సిగ్గుచేటు' అని అన్నారు. సీఎం హోదాలో ఉండి ఏం మాట్లాడుతున్నావో సోయి ఉందా రేవంత్ రెడ్డి? అని ఎర్రబెల్లి ప్రశ్నించారు. 'ప్రజా విజయోత్సవ సభలు పెట్టడం కాదు.. నిన్ను గెలిపించిన నీ సొంత నియోజకవర్గ ప్రజల సమస్యలు పట్టించుకో' అని సూచించారు. 'ఆనాడు ఉద్యమకారులపై తుపాకి గురిపెట్టిన నువ్వు ఈ రోజు అది చేసిన.. ఇది చేసిన అంటున్నవు. అసలు నువ్వు తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నవా? బాబ్లీ పోరాటంలో కూడా తప్పించుకొని తిరిగింది మర్చిపోయావా?' అని ప్రశ్నించారు. ఓటమి ఎరుగని నేతలు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుపై మాట్లాడే అర్హత రేవంత్‌రెడ్డికి లేదన్నారు. ఉద్యమ సమయంలో 1200 మంది ప్రాణాలు తీసిన సోనియాగాంధీకి బలిదేవత బిరుదు ఇచ్చిన రేవంత్‌రెడ్డికి ఇప్పుడు 'నా అమ్మ, నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల అమ్మ' అనడానికి నోరెలా వచ్చిందన్నారు. ప్రజా పాలన అంటూ ప్రజలను గాలికి వదిలేసిన రేవంత్‌రెడ్డి గాలి మోటర్‌లో ఢిల్లీ చుట్టూ చక్కర్లు కొడుతున్నాడని ఆరోపించారు. ఎన్నికల ముందు వరంగల్ వేదికగా రాహుల్‌గాంధీతో ప్రకటించిన రైతు డిక్లరేషన్ ఏమైందని ప్రశ్నించారు. కాళోజీ కళాక్షేత్రం కోసం 300 గజాల స్థలం అడిగితే ఇవ్వని కాంగ్రెస్ నాయకులకు ఆయన గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. ఏనాడైనా కాళోజీని ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా చూసావా? కలిశావా? అంటూ రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం కేసీఆర్ చొరవతో కాళోజీ కళాక్షేత్రాన్ని అద్భుతంగా నిర్మిస్తే.. ఇప్పుడు రిబ్బన్ కట్ చేసి తామే చేశామంటూ గొప్పలు చెప్పుకుంటున్నారని అన్నారు. ఆడబిడ్డలకు ఇచ్చిన హామీ మేరకు ప్రతినెలా మహిళలకు రూ. 2,500, బతుకమ్మ చీరలు, తులం బంగారం పథకాలను అమలు చేయాలన్నారు. మహిళా సంక్షేమానికి కాంగ్రెస్ చేసిందేమీ లేదని, ఎన్టీఆర్ హయాంలో మహిళా సంఘాలు ఏర్పాటైతే వాటిని క్షేత్రస్థాయిలో మాజీ సీఎం కేసీఆర్ బలోపేతం చేశారని, అది కూడా సీఎం రేవంత్‌రెడ్డికి తెలియదని ఎర్రబెల్లి ఎద్దేవా చేశారు.

రేవంత్ తస్మాత్ జాగ్రత్త..

మిషన్ భగీరథ ద్వారా రూ. వేల కోట్ల ఖర్చుతో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇంటింటికీ తాగు నీరందించిందని ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. సొంత పార్టీ ఎమ్మెల్యేలే సీఎంకు విలువ ఇవ్వడం లేదని, విజయోత్సవ సభకు రాని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డే అందుకు నిదర్శనమన్నారు. రేవంత్‌రెడ్డి లాంటి వాళ్లను చూసే ఆనాడు కాళోజీ 'ప్రాంతం వాడే మోసం చేస్తే ప్రాంతంలోనే పాతరెయ్యాలి.. పరాయోడు మోసం చేస్తే పొలిమేరల వరకు తరిమికొట్టాలి' అని చెప్పాడని అన్నారు. 'రేవంత్‌రెడ్డి.. నిన్ను పాతి పెట్టేందుకు యావత్ తెలంగాణ ప్రజలు సిద్ధంగా ఉన్నారు.. తస్మాత్ జాగ్రత్త' అంటూ హెచ్చరించారు. ఇకనైనా తీరు మార్చుకొని సీఎం పదవికి ఉన్న గౌరవాన్ని కాపాడాలని ఎర్రబెల్లి హితవు పలికారు.

రేవంత్‌ను అసహ్యించుకుంటున్న మహిళలు..

హనుమకొండలో నిర్వహించిన సభకు వచ్చిన మహిళలు సీఎం రేవంత్‌రెడ్డిని అసహ్యించుకుంటున్నారు. కొండను తవ్వి ఎలుకనైనా తీస్తాడనుకుంటే.. ఏమీ తీయలేదు. ఏపీ వోలు, ఎంపీడీవోల ఒత్తిడితోనే మహిళలు అయిష్టంగా సభకు వచ్చారు. కాళోజీ కళాక్షేత్రం ప్రారంభోత్సవం సందర్భంగా కవులు, కళాకారును సన్మానించకపోవడం సిగ్గుచేటు. రాబోయే ఎన్నికల్లో మహిళలు కర్రు కాల్చి వాత పెట్టడం ఖాయం. నిన్ను గద్దె దించేందుకు కూడా వరంగల్ మొదటే ఉంటుంది.

– డాక్టర్ తాటికొండ రాజయ్య, మాజీ ఎమ్మెల్యే

ముమ్మాటికీ అది వంచన సభ..

హనుమకొండలో కాంగ్రెస్ నిర్వహించింది ముమ్మాటికీ వంచన సభ. సీఎం రేవంత్‌రెడ్డి అబద్ధపు, దుర్మార్గపు మాటలు మాట్లాడారు. అనుభవలేమి, అవగాహనా రాహిత్యాన్ని సీఎం స్వయంగా ప్రకటించుకున్నారు. తెలంగాణ ప్రజలకు, ప్రత్యేకించి మహిళలకు చేస్తున్న ద్రోహానికి బహిరంగ క్షమాపణ చెప్పాలి. మహిళలకు ప్రతి నెలా రూ. 2,500, 18 ఏళ్లు పైబడి చదువుకొనే యువతులకు ఎలక్ట్రిక్ స్కూటర్లు, ఆడబిడ్డ వివాహానికి లక్ష ఆర్థిక సాయంతో పాటు తులం బంగారంతో పాటు అనేక హామీలిచ్చి ఇప్పటి వరకు అమలు చేయలేదు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రూ. 4.25 లక్షల కోట్లు మాత్రమే అప్పు చేసి అన్ని రంగాల్లో ఉత్పాదకతను పెంచి, సృష్టించిన సంపదను ప్రజలకు పంచి, దేశంలోనే రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలబెట్టాం. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చకుండానే 11 నెలల్లో రూ. 85 వేల కోట్ల అప్పు చేయడం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ ఘోర వైఫల్యానికి, అనుభవ, అవగాహనా రాహిత్యానికి నిదర్శనం. అధిష్టానం అపాయింట్‌మెంట్ నిరాకరిస్తున్నదని, సహచర మంత్రుల్లో అసహనం, రాష్ట్ర ప్రజల్లో వ్యతిరేకత, దీనికి తోడు సొంత నియోజకవర్గంలో ప్రజల తిరుగుబాటుతో రేవంత్‌రెడ్డికి పదవీ గండం ఉంది. ఇంత దీన స్థితిలో ఉన్న రేవంత్‌రెడ్డికి కేసీఆర్‌ను విమర్శించే అర్హత లేదు. కాంగ్రెస్ పార్టీలో ఒకప్పటి అగ్ర నాయకుడు వైఎస్ఆర్, నీ రాజకీయ గురువు చంద్రబాబు నాయుడును ఎదిరించి నిలబడ్డ పోరాట యోధుడు కేసీఆర్. 25 ఏళ్లుగా తెలంగాణ నలుమూలల వటవృక్షంలా వేళ్లూనుకున్న నాయకుడిని మొలకెత్తనివ్వ అన్న నిన్ను చూసి ప్రజలు నవ్వుకుంటున్నరు. బీఆర్ఎస్‌ను ప్రజలు ఎప్పుడూ ఆదరిస్తారు.

– సిరికొండ మధుసూదనాచారి, శాసనమండలిలో ప్రతిపక్ష నేత

అధికార మదంతో మాట్లాడుతున్న సీఎం

సీఎం రేవంత్‌రెడ్డి అధికార మదం, పిచ్చితో మాట్లాడుతున్నడు. 60 ఏండ్ల తెలంగాణ ప్రజల కలను సాకారం చేసిన ఉద్యమ నాయకుడు మాజీ సీఎం కేసీఆర్. ప్రజల గుండెల్లో గూడుకట్టుకొన్న వట వృక్షం. ఆయనను నువ్వు కాదు కదా.. నీలాంటి వంద మంది రేవంత్‌రెడ్డిలు వచ్చినా ఏమీ చేయలేరు. సమైక్య పాలనలో కాళోజీ ప్రస్తావన లేదు. తెలంగాణ ఏర్పాటయ్యాక అప్పటి సీఎం కేసీఆర్ కాళోజీకి గుర్తింపు ఇచ్చారు. కాళోజీ కళాక్షేత్రం కోసం గత కాంగ్రెస్‌లోని ముగ్గురు మంత్రులను 300 గజాలడిగితే 3 గజాల స్థలం ఇవ్వలేదు. ఆశపడ్డ మహిళలు, విద్యార్థులు భంగపడ్డరు. వరంగల్ డిక్లరేషన్ ఏమైంది?

– దాస్యం వినయ్ భాస్కర్, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు

కేసీఆర్‌ను ఎదుర్కొనే దమ్ముందా?

అనుకోకుండా సీఎం అయిన రేవంత్‌రెడ్డి తుపాకీ రాముడిలా మాట్లాడుతున్నడు. దొర్కాగ్యుల చేతుల్లోకి కాంగ్రెస్ పార్టీ పడింది. చేతకాని తనానికి మాటలెక్కువ అన్నట్లుగా సీఎం తిట్ల పురాణం చెప్పారు. సభలో మాట్లాడిన సింహభాగం కేసీఆర్ ప్రస్తావనే వచ్చింది. కేసీఆర్‌ను అసెంబ్లీకి రా.. రా అంటున్నవ్.. ఆయన వస్తే ఎదుర్కునే దమ్ము, ధైర్యం ఉందా నీకు? నువ్వు.. నీ పరివారం తట్టుకోలేరు.. నీ కౌంట్ డౌన్ స్టార్ట్ అయ్యింది.. త్వరలోనే నీ ప్రభుత్వం కూలి పోతుంది.. నిన్ను నీ సొంత పార్టీ నేతలే త్వరలో గద్దె దింపడం ఖాయం.

– గండ్ర వెంకట రమణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే

సీఎంవి డైవర్షన్ పాలిటిక్స్

కుక్కతోక వంకర అన్నట్టు ఉంది సీఎం రేవంత్ రెడ్డి తీరు. అతడు చేస్తున్నవన్నీ డైవర్షన్ పాలిటిక్సే. కేసీఆర్ అప్పుల చేశాడని చెప్తున్న రేవంత్‌రెడ్డి.. ఆయన సృష్టించిన సంపదపై ఎందుకు మాట్లాడటం లేదు. బెల్టు షాపులను కేసీఆర్ ప్రోత్సహించారని అసత్య ప్రచారం చేయడం సిగ్గుచేటు. నీ పార్టీలోనే నీకు విలువ లేదు. నీవు మూడు సార్లు మీటింగ్ పెడితే మీ పార్టీ నర్సంపేట ఎమ్మెల్యే ఎందుకు రాలేదు. తెలంగాణ ప్రజల గుండెల్లో నిలిచిన మహనీయుడు కేసీఆర్. కేటీఆర్, హరీశ్‌రావు ప్రజలకు గోమాత లాంటివారు.

– నన్నపునేని నరేందర్, మాజీ ఎమ్మెల్యే

సీఎం రేవంత్‌రెడ్డిది దుష్టపాలన

సీఎం రేవంత్‌రెడ్డిది దుష్టపాలన. వరంగల్ సభలో బూతు పురాణం చెప్పారు. ఆశతో సభకు వచ్చిన మహిళలు గోసపడ్డరు. కాళోజీ చరిత్రను అర్థం చేసుకోవడం రేవంత్‌రెడ్డికి సాధ్యం కాదు. మాజీ సీఎం వ్యవసాయరంగాన్ని అభివృద్ధి చేస్తే నీవు రైతులకు ఏం చేశావు? నీ మాటలతో రైతులు ఆశపడి భంగపడ్డరు. హిట్లర్, డయ్యర్ చరిత్ర ఏమైందో తెలుసుకో. నీ నోరు, నీ మంత్రుల నోరు మూసీ కంపులాగా ఉంది. రియల్ ఎస్టేట్‌ను నీ అన్నదమ్ములకు వదిలిపెట్టి, నువ్వు, డిప్యూటీ సీఎం, పొంగులేటి ముగ్గురు కలిసి ఆంబోతుల్లా రాష్ట్రాన్ని దోచుకుతింటున్నారు. అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్నారు. 15 శాతం కమీషన్లు ఇస్తేనే పెండింగ్ బిల్లులు మంజూరు చేస్తున్నారు. దమ్ముంటే బెల్ట్‌షాపులను మూయించు. గ్రామాల్లో గుడుంబా ఏరులై పారుతున్నా పట్టించుకోవడం లేదు. తెలంగాణలో కేసీఆర్ అనే మొక్కను మొలనివ్వనంటున్నావ్.. కేసీఆర్ అనే మహా వృక్షం నీడ నిన్ను ఎప్పుడూ వెంటాడుతునే ఉంటుంది. నువ్వు కూర్చున్న కుర్చీలో కూడా కేసీఆర్ కనిపిస్తడు. ఒట్టేసి చెబుతున్నా.. ఓరుగల్లు నుంచే నీ పతనం మొదలైతది. మమ్ములనే అసెంబ్లీలో తట్టుకోలేక పోతున్నవ్ రేవంత్‌రెడ్డి.. కేసీఆర్ అసెంబ్లీకి వస్తే తట్టుకుంవా. కేసీఆర్ అవసరమైనప్పుడు కచ్చితంగా వస్తారు. మిమ్ముల వదిలే ప్రసక్తే లేదు.

– పల్లా రాజేశ్వర్‌రెడ్డి, జనగామ ఎమ్మెల్యే